క్లుప్తంగా

గ్రామాల్లో విద్యుత్ స్తంభాల మార్పిడి



జోగింపేటలో విద్యుత్ స్తంభాలు అమర్చుతున్న సిబ్బంది

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో విరిగిన విద్యుత్ స్తంభాల స్థానాలు కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈపీడీసీఎల్ ఏఈ సోమేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు జోగింపేటలో సర్పంచ్ కె.సింహాచలం ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యుత్ లైన్ల మరమ్మతులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో గతంలో వేసిన విద్యుత్ స్తంభాలు శిథిల మవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఇప్పలవలస, జోగింపేట, వెంకటాపురం, నిడగల్లు, రేపటివలస గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు మార్చినట్లు తెలిపారు. శాఖాపరమైన ఇబ్బందులు నివారించడానికి సత్వరచర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



బలిజిపేట ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

బలిజిపేట: రానున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పన ఏ విధంగా ఉందనే దానిపై ముగ్గురు సభ్యుల కమిటీ బలిజిపేట ఉన్నత పాఠశాలను గురువారం పర్యవేక్షించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేర ఎంఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెదపెంకి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామారావు, చిలకలపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకరరావులు పర్యవేక్షించిన వారిలో ఉన్నారు. పరీక్షలు జరిగే బలిజిపేట ఉన్నత పాఠశాలలోని ఎ,బి కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నవీ లేనివీ గమనించారు. 498మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. బెంచీలు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలు గమనించారు. పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



నోటీసు బోర్డులో ఆసరా లిస్టు పెడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందుపూరు గున్నేశ్వరరావు

పార్వతీపురం టౌన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందుపూరు గున్నేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన 14వ వార్డు సచివాలయం పరిధిలో ఆసరా మూడవ విడత వెరిఫికేషన్ లిస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ వైఎస్సార్ ఆసరా అందజేయనున్నట్లు తెలిపారు. కుల, మత, రాజకీయాలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమపథకాలకు అందజేస్తోందని తెలిపారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి, మరిన్ని సేవలు చేరువచేయాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ చిట్టెమ్మ, సచివాలయ అడ్మిన్ ఉపేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయించాలి

● డీఈఈ ప్రసాద్ బాబు



ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌తో మాట్లాడుతున్న డీఈఈ

బలిజిపేట: వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయించి ప్రారంభోత్సవాలు నిర్వహించాలని డీఈఈ ప్రసాద్‌బాబు అన్నారు. బలిజిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌తో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో లేఅవుట్లు, వ్యక్తిగత గృహాలు కలిపి 1,581నిర్మాణాలు పూర్తిచేయాలని అందులో ఇప్పటికి 981పూర్తవగా మిగిలిన 600 పూర్తిచేయించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరం కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: పట్టణంలోని పది సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 19 వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు



గడపగడపకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని, అందులో భాగంగానే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని డీకే పట్నం సచివాలయం పరిధిలోని కొత్త లిడికివలస గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న ప్రభుత్వ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. వార్డుల్లో ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లోని కొన్ని ప్రాంతాల్లో రోడ్లను పరిశీలించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని ఎన్నికల హామీల్లో ఇచ్చిన నవరత్నాల వాగ్దానాలను సీఎం అమలు చేస్తున్నారన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నవరత్నాల ద్వారా ఆర్థిక చేయూత ఇస్తున్నామని తెలిపారు.

సచివాలయాల నిధులతో అభివృద్ధి పనులు

ప్రభుత్వం చేసే అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్యప్రచారాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. వచ్చే రెండేళ్ల కాలంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని వార్డు వాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందిస్తూ మున్సిపల్ అధికారులతో మాట్లాడి సచివాలయానికి రానున్న రూ.20లక్షల్లో ఈ మూడు అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. సాధ్యమైనంత త్వరలో రోడ్లు, కాలువలు మంచినీటి కుళాయిల ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథ రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు వెంపలి గురురాజు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు ,కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుచ్చిమిలో..

సీతానగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని ఎన్నికలహామీ ప్రకారం నవరత్నాల పథకాల వాగ్దానాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని, అందులో భాగంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురువారం సాయంత్రం మండలంలోని గుచ్చిమిలో సర్పంచ్ ఎం శ్రీదేవి, ఎంపీటీసీ సీహెచ్ జగదీశ్వరరావు , మాజీ సర్పంచ్ ధనుంజయనాయుడు, స్థానిక నాయకులు బి శంకరరావు, మన్మథ రావు, పీఏసీఎస్ చైర్మన్ సంజీవినాయుడు ఆధ్వర్యంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు ప్రతి ఇంటికివెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ప్రజలసమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాన్ని అభివృపథంలో నడిపించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం. బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు పి.ఈశ్వరనారాయణ, వైఎస్ ఆర్‌సీపీ మండల నాయకులు బి.చిట్టిరాజు, గ్రామ ఉపసర్పంచ్ ఆర్.వెంకరమణ, ఎంపీడీఓ బి. కృష్ణమహేష్‌రెడ్డి, మండల వెలుగు, ఉపాధిహామీ, విద్యుత్, పంచాయతీ విస్తరణ అధికారులు ఆర్.శ్రీరాములు, నాగలక్ష్మి, సోమేశ్వరరావు, కె కుమారవర్మ, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామసభల్లో భూముల వివరాలు తెలియజేయాలి




మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న భూరక్ష–భూహక్కు పథకం ద్వారా రైతులకు పట్టాల పంపిణీకి చర్యలు చేపట్టడమే గ్రామ సభల ముఖ్య ఉద్దేశమని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు గురువారం సర్వే ప్రక్రియ పూర్తయిన అంటిపేట పంచాయతీ వెంకటాపురం, బక్కుపేట గ్రామాల్లో రైతులతో రీసర్వే డీటీ చిట్టెమ్మ అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. ఈ గ్రామసభల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ ఎన్వీ రమణ మాట్లాడుతూ ఇంతవరకూ గ్రామాల్లో డ్రోన్‌సర్వే, రోవర్ సహాయంతో సర్వే పనులు పూర్తి కావడంతో గ్రామసభలు నిర్వహించి రైతుల వద్ద ఉన్న క్రయవిక్రయాలకు సంబంధించిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌లు, గ్రామ పురోణీలు, వీలునామా, గిఫ్ట్ డీడ్ పత్రాలు దరఖాస్తుతో పాందుపర్చి సచివాలయం లేదా, వీఆర్వోకు ఇవ్వాలని సూచించారు. కొత్త పాస్ పుస్తకాలు ఇచ్చేముందు భూములకు సంబంధించిన వివరాలను గ్రామ సభల ద్వారా తెలియజేసిన తరువాతే వైఎస్ఆర్–జగనన్న భూ రక్ష, భూహక్కు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ఆర్ఐ, వీర్వో, మండల సర్వేయర్, డిజిటల్ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు గురువారం చినభోగిలి, గెడ్డలుప్పి గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారానికో పర్యాయం అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సర్పంచ్‌ల పర్యవేక్షణలో నిర్వహించాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి చేసిన సూచనల మేరకు పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. అలాగే కాలువల్లో తీసిన పూడికలను చెత్తశుద్ధి కేంద్రాలకు తరలించాలని సూచించారు. గ్రామాల్లో సేకరిస్తున్న తడి పొడి చెత్తను, వీధుల్లో తీస్తున్న చెత్తను చెత్తశుద్ధి కేంద్రాలకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి, గోదాదేవికి పూజలు



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహ స్వామి



పల్లకిలో ఊరేగుతున్న గోదాదేవి అమ్మవారు

సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహ స్వామి వారికి, అలాగే వేణుగోపాల స్వామి ఆలయంలోని గోదా దేవి అమ్మవారికి వైభవంగా పూజలు జరిగాయి.ఈ మేరకు ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రతి గురువారం పలు గ్రామాల నుంచి భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు లక్ష్మీనృసింహస్వామి వస్తుంటారని తెలిపారు. అలాగే ధనుర్మాసం ఉత్సవాలను పురస్కరించుకుని వేణుగోపాలస్వామి, గోదాదేవి అమ్మవార్లకు నిత్యం పూజలు జరుగుతున్నాయని తెలియజేశారు. ప్రతిరోజూ పూజలనంతరం గోదాదేవి అమ్మవారిని గోవింద మాలధారులంతా కలిసి పల్లకీలో అధిష్టించి తిరువీధి చేస్తూ గోవింద నామస్మరణ చేస్తున్నట్లు చెప్పారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు సమకూర్చిన నిధులతో ప్రసాదాల వితరణ నిర్వహిస్తున్నామని అన్నారు.

గర్భిణుల వసతిగృహం పరిశీలన



గర్భిణులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

సాలూరు: పట్టణంలోని వైటీసీలో నిర్వహిస్తున్న గిరిశిఖర గర్భిణుల వసతిగృహాన్ని ఆర్‌జేడీ చిన్మయిదేవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వసతిగృహంలో అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం పట్టణ సీడీపీఓ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఆ తర్వాత పాచిపెంట మండలం పిండ్రంగివలస అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఆమె వెంట సీడీపీఓ సత్యవతి, నీడ్ డైరెక్టర్ వేణుగోపాలరావు, తదితరులున్నారు.

పింఛన్‌దారులకు ముందే వచ్చిన పండగ

- తంఛన్‌గా 1వ తేదీన పింఛన్ అందజేత
- మండల పరిధిలో నూతనంగా 456 పింఛన్లు మంజూరు
- లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- పెద్దబొండపల్లిలో సచివాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: కొత్త పింఛన్లు, పెంచిన పింఛన్‌తో పింఛనుదారులకు ముందే సంక్రాంతి పండగ వచ్చిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం మండలం పరిధిలో కొత్తగా 456 పింఛన్లు మంజూరు కాగా వాటిని పెద్దబొండపల్లి గ్రామంలో లబ్ధిదారులందరికీ గురువారం పంపిణీ చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆనాడు ప్రజాసంకల్పయాత్రలో ఏదైతే మాటఇచ్చారో ఆ ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేశారన్నారు. ప్రతి ఏడాది పింఛన్ పెంచుకుంటూ పోతూ రూ.3000 అందచేస్తామని చెప్పిన మాట ప్రకారం ఈనెల జనవరి 1వ తేదీ నుంచి రూ. 2,750కి పెంచడమే కాకుండా కొత్తగా అర్హత సాధించిన వారికి కూడా ఈనెల నుంచి పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలు, అక్కా చెల్లెళ్లకు అండగా ఉంటానని చెప్పడమే కాకుండా అర్హులైన వారికి పింఛన్ మంజూరు చేయడంలో మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా పార్టీలు, రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ పింఛన్ మంజూరు చేసి ప్రతి నెలా ఒకటవ తేదీన సూర్యుడు ఉదయించక ముందే వలంటీర్లు లబ్ధిదారుల తలుపు తట్టి మరీ అందజేస్తున్నట్లు చెప్పారు.

సీఎం జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలి

ఇచ్చిన హామీలు మాట తప్పకుండా అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించు కోవాలని, అందుకు ప్రతి ఒక్కరూ తప్పక ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథ రావు, ఏఎంసీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యశ్రీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ వై.తిరుపతిరావు, ఎంపీడీఓ అకీబ్ జావేద్, గ్రామ సర్పంచ్ సవరాపు తవుడమ్మ, పీఏసీఎస్ చైర్మన్లు బి.దామోదర రావు, తెర్లి రామస్వామి, చుట్టు పక్కల గ్రామాల సర్పంచ్‌లు తీళ్ల కృష్ణారావు, జక్కు ప్రవీణ్ కుమార్, జి. శంకరరావు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



పింఛన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి..



పింఛన్ అందజేస్తున్న మంత్రి రాజన్నదొర

● ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజలందరి మేలు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో కొత్తగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు గురువారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్న ప్రతి ఇంటికీ ఓ పెద్ద కొడుకు అయ్యాడన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లు అందిస్తున్న ఘనత దేశంలో ఒక్క జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అబద్ధపు మాటలు చెప్పుకుంటూ వచ్చే టీడీపీ నాయకులను నమ్మవద్దని కోరారు. గత టీడీపీ పాలనలో రేషన్ కార్డు కావాలన్నా, పింఛన్ పొందాలన్నా జన్మభూమి కమిటీ సభ్యుల వద్దకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అన్ని అర్హతలుంటే వలంటీర్, సచివాలయ సిబ్బంది ఇంటి వద్దే పింఛన్ అందజేస్తారని చెప్పారు.

బహిరంగచర్చకు రావాలి..

నియోజకవర్గంలో ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో అనే అంశంపై స్థానిక టీడీపీ నాయకులు బహిరంగ చర్చకు రావాలని మంత్రి రాజన్నదొర సవాల్ విసిరారు. తోణాం, మామిడిపల్లి, శంబర, సాలూరు, తదితర రోడ్లపై ఉడుపులు ఉడిసి రోడ్లు బాగోలేవని నానాయాగీ చేసిన టీడీపీ నాయకులు తమ హయాంలో ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ఇదిలా ఉంటే పట్టణంలో వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో రోడ్డు పాడైందని స్థానికులు తెలియజేయగా.. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఫ్లోర్ లీడర్ గొర్లె జగన్‌మోహన్‌రావు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, కౌన్సిలర్లు గిరి రఘు, రాపాక మాధవరావు, గొర్లె వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న రుణం తీర్చుకోలేనిది..



వరలక్ష్మిని ఓదారుస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

సాలూరు: ముఖ్యమంత్రి జగనన్న రుణం తీర్చుకోలేనిదని పట్టణంలోని 18వ వార్డుకు చెందిన దివ్యాంగురాలు వి. వరలక్ష్మి అన్నారు. తనకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని గత ప్రభుత్వ కాలంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదని వాపోయింది. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తనకు పింఛన్ మంజూరు చేయడంతో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీలో డిప్యూటీ సీఎం రాజన్నదొర చేతులమీదుగా పింఛన్ అందుకుంది. ఈ సమయంలో ఆమె భావోద్వేగానికి గురై కన్నీటిపర్యంతమైంది. దీంతో మంత్రి రాజన్నదొర, మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, తదితరులు వరలక్ష్మికి ధైర్యం చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని గురువునాయుడుపేటలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్ అధ్యక్షతన సర్పంచ్ గొట్టాపు చిట్టెమ్మ, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్ర ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి, తదితరులు ఇంటింటికీ వెళ్లి గడిచిన మూడున్నరేళ్లలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కొరజన్ని సింహాచలం, పార్టీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, జిల్లా కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు సనాపతి నారాయణరావు, కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు దండి ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోను ధనుంజయ్, మూకల అప్పారావు, బోను మురళి, యచ్చం వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు మెరుగైన సేవలందించాలి



గాదెలవలసలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సచివాలయ ఉద్యోగులు ప్రజలకు వివరిస్తూ మెరుగైన సేవలందించాలని ఎంపీడీఓ బి.క్రిష్ణ మహేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని గాదెలవలస సచివాలయాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సచివాలయ ఉద్యోగుల హాజరు, మూమెంట్ రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ వలంటీర్ల ద్వారా సచివాలయ ఉద్యోగులు ప్రజలకు తెలియజేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక పరమైన సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయంతో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని చెప్పారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని వెల్ఫేర్ సహాయకులు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణుల వివరాలు నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథ రావు

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథ రావు

పార్వతీపురం టౌన్: హైరిస్క్ గర్భిణుల వివరాలు నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఆస్పత్రి సమావేశ మందిరంలో ఆశానోడల్ అధికారులతో ఆరోగ్య కార్యక్రమాలపై గురువారం సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీ హెల్త్ ప్రోగ్రామ్‌ల ప్రగతి నివేదికల వారీగా సమీక్షించి పురోగతి దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య తనిఖీల వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయాలని, ప్రసవ సమయానికి వారం రోజుముందుగానే సంబంధిత రిఫరల్ కేంద్రంలో చేరే విధంగా చూడాలని, అదేవిధంగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా అన్ని వైద్యసేవలు ఆ పరిధిలో ఉండే ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. చిన్న పిల్లల టీకా కార్యక్రమంలో నూతనంగా చేర్చిన ఎఫ్ఐపీవీ మూడవ డోసు అర్హులైన పిల్లలందరికీ పూర్తి చేయాలని సూచించారు. గర్భిణీ, శిశు ఆరోగ్య సందేశాలను ఫోన్ వాయిస్ ద్వారా అందజేసే కిల్కార్ గురించి గర్భిణులు, బాలింతలందరికీ అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. యుక్త వయస్సు వివాహాలపై, తద్వారా ప్రభావితమయ్యే శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా రక్తహీనత నివారణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వినోద్‌కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విజయ్‌మోహన్, డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.